



# ప్లాస్టిక్ నిషేధం



- అమ్రాబాద్ అభయారణ్యంలో కఠిన నిబంధనలు
- పెద్ద పులులు, ఇతర వన్యప్రాణులకు హాని కలుగకుండా చర్యలు
- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న అటవీశాఖ

మన్ననూర్, జూన్ 6: అమ్రాబాద్ అభయారణ్యంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని క్రమేపీ తగ్గించడంపై అటవీ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించి, పలురకాల పర్యావరణ హిత కార్యక్రమాలను చేపడుతోంది. నల్లమల పులుల అభయారణ్య ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధించేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాజాగా జీవో జారీ చేశారు. ఆ ఆదేశాలను అమలు చేసేందుకు అధికారులు కసరత్తును ప్రారంభించారు.

**ప్లాస్టిక్‌తో వన్యప్రాణులకు హాని..**

అభయారణ్య ప్రాంతం 2,166 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. అడవిలో 25 పెద్ద పులులు, 170 చిరుత పులులు, జింకలు, సాంబర్లు, మనుబోతు, అడవి పందులు, నెమళ్లు, మూషిక జింకలు, అడవి కోళ్లు, అడవి కుక్కలు, అడవిపిల్లి, ఎలుగుబంట్లు కలిపి 2000లకు పైగా ఉన్నట్లు అటవీశాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇటీవల పెద్ద పులులు, చిరుతల సంఖ్య పెరిగింది. పెద్ద పులులకు ఆహారం కోసం సరిపడా జంతువుల సంఖ్య ఉందా?.. లేకుంటే ఎంత మేర పెంచాలో తెలుసుకునేందుకు మే నెలలో మూడు రోజుల పాటు అన్ని బీట్లలో ఎకలాజికల్ సర్వే చేపట్టారు. ప్లాస్టిక్ వలన వన్యప్రాణులకు ఎంతో ప్రాణహాని ఉందని అటవీ అధికారులు గుర్తించారు. అడవి గుండా ఉన్న రహదారులు దాటే క్రమంలో పర్యాటకులు ప్లాస్టిక్ వస్తువులను, నీళ్ల సీసాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వదిలివేయడం వలన శాకాహార జంతువులైన జింకలు, సాంబారు, కణితి వంటివి వాటిని తినడం వల్ల జీర్ణకోశ సమస్యలు వచ్చి.. ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు గుర్తించారు. అందుకే ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

అమ్రాబాద్ అడవుల్లో ప్లాస్టిక్ నిషేధానికి ఇప్పటికే పలు రకాల కార్యక్రమాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు, మద్దిమడుగు, దోమలపెంట వరకు రహదారులపై పర్యాటకులు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర తినుబండారాల కవర్లను వదిలి వెళ్తున్నారు. వాటిని నిత్యం ఒక దగ్గరికి చేర్చేందుకు అటవీ శాఖ స్థానికంగా ఉండే ఎనిమిది మంది సిబ్బందిని నియమించింది. ఈ వ్యర్థాలను మన్ననూరు వద్ద ఉన్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రానికి చేర్చుతారు. అక్కడి సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి, రీసైక్లింగ్ యంత్రంలో వేసిన తర్వాత కట్టలు కట్టి, హైదరాబాద్‌లోని సెంటర్‌కు తరలిస్తారు. ఈ సిబ్బంది వేతనాల కోసం ఎనిమిదేళ్లుగా మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద అటవీశాఖ టోల్‌గేట్లను ఏర్పాటు చేసింది. పర్యాటకుల వాహనాల నుంచి మెయింటెనెన్స్ చార్జీల రూపేణ టోల్ ఫీజులను వసూలు చేసి, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో ప్రత్యామ్నాయంగా జనపనార సంచులు, పర్సులు, కూరగాయల బ్యాగులు, అడవిలో లభించే మార్వటాకులతో పర్యావరణహిత టిఫిన్, భోజనం ప్లేట్ల తయారీ కేంద్రాన్ని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ నిర్వహిస్తోంది. సఫారీ టూర్‌కు వచ్చిన పర్యాటకులకు ఈ పర్యావరణ హిత వస్తువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. ముందు పావు, అర లీటరు ప్లాస్టిక్ నీటి బాటిళ్లు మన్ననూరు నుంచి తీసుకెళ్లకుండా నిషేధం విధించి, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ఉన్నతాధికారులతో సమాలోచనలు చేస్తున్నారు.



రీసైక్లింగ్ కేంద్రంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

### ప్లాస్టిక్ వాడకం తగ్గేలా చర్యలు



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు నల్లమలలో జూలై ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధంపై కఠిన నిబంధనలు విధించనున్నాం. ప్లాస్టిక్ సీసాలతో పాటు తినుబండారాల కవర్లను అడవిలో వదలకుండా మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టు వద్ద పర్యటకులకు అవగాహన కల్పిస్తాం. మన్ననూరు, మద్దిమడుగు, వటవర్లపల్లి, దోమలపెంట తదితర గ్రామాల్లోని హోటళ్లు, దాబాలు, దుకాణాల యజమానులకు సైతం ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన కల్పిస్తాం. పర్యావరణహిత ప్లేట్లు, కప్పులను ఉమామహేశ్వరం, మద్దిమడుగు, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో ప్రసాదాల పంపిణీకి వాడేలా చర్యలు చేపడతాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో

### ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో ఉపాధి



ప్లాస్టిక్ వ్యర్థాలైన బాటిళ్లు, కవర్లు, సీసాలు రహదారి పొడవునా సేకరించి మన్ననూరులోని రీసైక్లింగ్ కేంద్రానికి తరలిస్తున్నాం. ఆ కేంద్రంలో యంత్రాల ద్వారా 10 కిలోలకుపైగా బరువు ఉండేలా వ్యర్థాలను కట్టలు కట్టి, హైదరాబాద్‌లోని కేంద్రానికి తరలిస్తున్నాం. అమ్రాబాద్ అభయారణ్యంలో ప్లాస్టిక్ రహిత కార్యక్రమాల వల్ల ఎనిమిది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

- సతీష్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రం నిర్వాహకుడు



మన్ననూరులోని పర్యావరణ హిత టోల్‌గేట్ (అటవీ చెక్‌పోస్టు)



అడవిలో ప్లాస్టిక్ బాటిళ్లను సేకరిస్తున్న అటవీశాఖ వలంటీర్లు



అలంపూర్ : ప్రభుత్వ కళాశాల చుట్టూ నిలిచిన వరద నీరు

# స్తంభించిన జనజీవనం

- భారీ వర్షానికి జలమయమైన రోడ్లు, కాలనీలు
- పిడుగుపాటుకు మహిళ మృతి



పాలమూరులో మినీ ట్యాంక్‌బండ్ రహదారిపై నిలిచిన వర్షం నీరు

మహబూబ్‌నగర్/అలంపూరు/వెల్దండ/ ఉప్పునుంతల, జూన్ 6 : ఉమ్మడి పాలమూరు జిల్లాను వర్షం ముంచెత్తింది. గురువారం మధ్యాహ్నం కురిసిన వానకు పాలమూరులో జనజీవనం స్తంభించిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. వాతావరణం మేఘావృతమవడంతో చీకటి అలుముకున్నది. మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. బుధవారం రాత్రి, గురువారం కురిసిన వానతో మినీ ట్యాంక్‌బండ్ రహదారి వర్షపు నీటితో నిండి నీరు ఫుట్‌పాత్‌పైకి చేరింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. అలంపూరు పట్టణంలో అక్బర్ పేట కాలనీలో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలు జలమయమయ్యాయి. వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డివాముల చుట్టూ నిలిచాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ నీరు చేరడంతో దీవిని తలపించింది. కళాశాల ప్రాంగణం పూర్తిగా జలమయమైంది.



ఉప్పునుంతలలో పిడుగు పడి మృతి చెందిన ఎద్దు

వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గురువారం పిడుగుపాటుకు గురై కొమ్మరెక్క జంగమ్మ (45) మృతి చెందగా, ఆమె భర్త కృష్ణయ్య గాయపడ్డాడు. కృష్ణయ్య తన భార్య జంగమ్మ, అత్త జంగిలి ఈదమ్మతో కలిసి తన వ్యవసాయ పొలంలో పత్తిగింజలు నాటుతుండగా ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో జంగమ్మ అక్కడికక్కడే మృతిచెందగా భర్త కృష్ణయ్య గాయపడ్డాడు. అత్త తృటిలో ప్రాణాపాయంనుంచి తప్పించుకుంది. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కృష్ణయ్యను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఉప్పునుంతలలో సూరం రాజేందర్‌రెడ్డి బుధవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద ఎద్దును కట్టేశారు. రాత్రి కురిసిన గాలి వానలలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల విలువ ఉంటుందని బాధితుడు వాపోయాడు.



అలంపూర్ : అక్బర్ పేటలో ఇంట్లోకి చేరిన వరద నీరు

**అలంపూరులో ఎత్తిపోయని మోటార్లు..**

ఎత్తిపోతల ద్వారా వరద నీరు, మురుగు నీటిని ఎత్తి పోసే మోటార్లు పనిచేయకపోవడంతో వీధులలో నీరు నిలుస్తోందని, ఇళ్లలోకి నీరు చేరుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమస్యలపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వివరించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలను దృష్టిలో ఉంచుకుని త్వరగా పరిష్కరించాలని చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



అలంపూర్ : ఎత్తిపోతల మోటార్ల వద్ద నిండిన వరద నీరు

# అతివేగంతో ప్రాణాలకు ముప్పు

- నారాయణపేట జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- 2019 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 877 యాక్సిడెంట్లు
- 498 మంది మృతి.. 828 మందికి గాయాలు

నారాయణపేట, జూన్ 6: నారాయణపేట జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. అతివేగంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకుగురై ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2019 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు వరకు 877 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 498 మంది మరణించారు. 828 మంది గాయపడ్డారు. ఇటీవల మక్తల్ శివారులో కర్ణాటక బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం, అతి వేగం వల్ల ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిశాయి. ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు జాగ్రత్తలపై ప్రజలకు ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారి 56 కిలో మీటర్ల మేర ఉంది. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాస్‌ను గుర్తించారు. మరికల్ సర్కిల్‌లో తొమ్మిది, మక్తల్‌లో 18 ఇలా మొత్తం 27 గుర్తించారు. ఆయా చోట్ల అధికారులతో రోడ్ సైన్ బోర్డ్స్, బారికేడ్లు, స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయించారు. అతివేగం నియంత్రణ కోసం జాతీయ రహదారిపై మరికల్, రాయిచూర్ వద్ద స్పీడ్‌గన్‌లను ఏర్పాటు చేశారు. వాటిద్వారా వాహనాలు వేగం 80 కిలో మీటర్లు దాటితే ఆటోమెటిక్‌గా జరిమానా పడుతుంది. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ తదితర కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్‌ఐలు, కళాబృందాలు, షీటీమ్స్ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. రహదారులపై వాహనదారులు వాహనాలను అనవసరంగా ఆపినా, అనుకోకుండా రోడ్డుపై ఆగిపోయినా, వాటి వెనుక స్టిక్కర్లు, గుర్తులు అతికించుకోకుండా ఇతరుల రోడ్డు ప్రమాదాలకు, మరణాలకు కారణమైతే చట్టం ప్రకారం వాహనదారులకు పదేళ్ల జైలు శిక్ష పడుతుందని చెబుతున్నారు.



మక్తల్‌లో కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు(ఫైల్)

జిల్లాలో జరిగిన ప్రమాదాల వివరాలు

| సంవత్సరం | ప్రమాదాలు | మృతులు | క్షతగాత్రులు |
|---|---|---|---|
| 2019 | 161 | 70 | 195 |
| 2020 | 163 | 88 | 166 |
| 2021 | 135 | 90 | 137 |
| 2022 | 156 | 106 | 139 |
| 2023 | 185 | 102 | 132 |
| 2024 | 77 | 42 | 59 |

# ఇసుక మాఫియా

- అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా
- ఒక టిప్పర్‌కు అనుమతితో పదుల సంఖ్యలో తరలింపు
- దుందుభీ నుంచి రోజుకు 30 నుంచి 50 టిప్పర్లలో తరలుతున్న ఇసుక
- ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నా పట్టించుకోని అధికారులు



పొల్మూరు వద్ద నిల్వ చేసిన ఇసుక



డంప్ చేసిన ఇసుకను హిటాచీ ద్వారా టిప్పర్‌లోకి నింపుతున్న వ్యాపారులు

నాగర్‌కర్నూల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ నది పరివాహక ప్రాంతంలో కంటికి రెప్పలా కాపాడుకున్న ఇసుక మేటలను కళ్ల ఎదుటే కొల్లగొడుతుంటే నిలువరించలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లడం పరివాహక ప్రాంత ప్రజలను కలవరపెడుతున్నది. అనుమతుల పేరిట ఇసుక దోపిడీ కొనసాగుతుండడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. రోజుకు పదుల సంఖ్యలో భారీ టిప్పర్లు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు మౌనం దాల్చడం వెనక అంతర్యమేమిటో బోధపడడం లేదు. తాడూరు మండలం మేడిపూర్, పొల్మూరు, గుట్టలపల్లి ప్రాంతాల్లో రోజుకు టిప్పర్లల్లో ఇసుక దోపిడీ కొనసాగుతున్నది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్న దుందుభీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలివెళ్తున్నా ఎవరూ పట్టించుకునే పాపాన పోవడం లేదంటూ పొల్మూరు, మేడిపూర్ గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**మైనింగ్ ఆదాయానికి గండి**

ఇసుక అక్రమ రవాణాతో మైనింగ్ శాఖ లక్షల రూపాయలు నష్టపోతున్నా అధికారులు నోరు మెదపకపోవడం వెనుక అంతర్యమేమిటో బోధపడడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శ్యాండ్ టాక్సీ వాహనాలు నడపవల్సి ఉంటుంది. ఇసుక ఎవరికి అవసరం ఉంటే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ ద్వారా అనుమతి పొందాలి. అనుమతి పొందిన పత్రంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న అధికారికి అనుమతి పత్రం చూపించి ఇసుకను ట్రాక్టర్లలో తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం పొల్మూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వద్ద భిన్నమైన పరిస్థితి కన్పిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి వారు ఇసుకను అక్రమంగా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దుందుభీ నదిలోకి ప్రత్యేకంగా రోడ్లు వేసి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దుందుభీ నదిలో నుంచి బయటకు ప్రతీరోజు భారీ టిప్పర్లలో దాదాపు 500 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా రవాణా అవుతుంది. జిల్లాలోనే కాక జిల్లా సరిహద్దులను కూడా దాటిస్తున్నట్లు సమాచారం. దుందుభీ పరివాహక ప్రాంతంలో కల్వకుర్తి మండలం గుండూరు, లింగసానిపల్లితో పాటుగా తాడూరు మండలంలోని మేడిపూర్, పొల్మూరు గ్రామాల్లో ఇసుక డంప్‌లు ఉన్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఉప్పునుంతల మండలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.



ఇసుక లోడ్‌తో టిప్పర్లు తిరగడంతో పగిలిపోయిన బీటీ రోడ్డు

**జాతీయ రహదారి పేరిట కొనసాగుతున్న అక్రమాలు**

మేడిపూర్ గ్రామం వద్ద కల్వకుర్తి నంద్యాల జాతీయరహదారికి సంబంధించి దుందుభీ నది వద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణ పనులు నడుస్తున్నాయి. ఈ పనులకు ఇసుక అవసరం ఉన్న సందర్భంలో ప్రభుత్వం వాడుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇదే ఇసుక దోపిడీదారులకు వరంగా మారింది. దీనిని సాకుగా చూపి రాత్రి పగలు తేడా లేకుండా తోడేళ్లలా ఇసుకను తోడేస్తున్నారు. కొన్నిసార్లు గ్రామస్థులు టిప్పర్లను అడ్డుకున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. అదేవిధంగా దుందుభీ నది పరివాహక ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా వాహనాలు చక్కర్లు కొడుతుండడంతో మేడిపూర్, పొల్మూరు, గుట్టలపల్లి ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. భారీ టిప్పర్లను మైనర్లు నడుపుతున్నప్పటికీ రోడ్డు రవాణా శాఖకు చెందిన అధికారులు మౌనంగా ఉండటం విశేషం.



# ఎద్దుల బండిని ఢీ కొట్టిన బైక్

- యువకుడి మృతి

తాడూరు, జూన్ 6 : ప్రమాదవశాత్తు పొలం పక్కలో ఆగి ఉన్న ఎద్దుల బండిని మోటారు సైకిల్‌తో ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఐతోల్ గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి (30) ఫైనాన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఐతోల్ గ్రామం నుంచి మాదారం మీదుగా కల్వకుర్తి వైపు వెళ్తున్న క్రమంలో సిర్సవాడ మాదారం గ్రామాల మధ్య పొలం పక్కన ఆగి ఉన్న ఎద్దుల బండిని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమయంలో మోటారు సైకిల్‌పై ఇదే గ్రామానికి చెందిన శివ కూడా ఉన్నప్పటికీ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఘటన స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటన స్థలికి చేరుకుని విచారణ చేపట్టిన అనంతరం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. జరిగిన ఘటనకు సంబంధించి మృతుడి తండ్రి తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. మృతునికి తల్లి రేణమ్మతో పాటు సోదరుడు ఉన్నారు.



రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గద్వాల, జూన్ 6 : జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని గోనుపాడు - పార్చర్ల స్టేజీల మధ్య గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని బొప్పల లక్ష్మన్న (66) అనే వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ పర్వతాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధరూర్ మండల కేంద్రానికి చెందిన బొప్పల లక్ష్మన్న గద్వాల నుంచి ధరూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై ఆయన కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.



బొప్పల లక్ష్మన్న (ఫైల్)

# లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు

» మన్ననూరులో నిరుపయోగంగా ఈ హెల్త్, డయాగ్నోస్టిక్ కేంద్రం




మన్ననూరులో వృథాగా ఉన్న డయాగ్నోస్టిక్ కేంద్రం భవనం

మన్ననూర్, జూన్ 6 : లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్యకేంద్రం, డయాగ్నోస్టిక్ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన భవనం వృథాగా మారి నిరుపయోగంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన మారుమూల ఏజెన్సీ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆదివాసీ చెంచు గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వాలు సుమారు రూ.40లక్షలతో నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రం, వ్యాధినిర్ధారణ పరీక్షల నిమిత్తం ఏర్పాటు చేసిన భవనం ప్రారంభానికే పరిమితమయ్యాయి. గత 10ఏళ్ల క్రితం ఏజన్సీ పరిధిలో గల మన్ననూరు, లింగాల పీహెచ్‌సీల్లో టెలీమెడిసిన్ సేవల నిమిత్తం ఈ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే కొంత మంది ఆరోగ్య సిబ్బందికి అంత ర్జాలంలో రోగికి అత్యవసర పరిస్థితిలో టెలీ మెడిసిన్ విధానంలో రోగికి ఎలా చికిత్స నిర్వహించాలి అనే విషయంపై శిక్షణ ఇచ్చారు. కానీ వాటికి కావాల్సిన సామగ్రిని సమకూర్చకుండా గాలికి వదిలేశారు. ప్రస్తుతం ఈ ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీలో ఉండే మందుల నిలువ చేసేందుకు ఉపయోగిస్తున్నారు. కానీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగులకు టెలీమెడిసిన్ సేవలు అందుబాటులో లేకుండా పోయింది. ఇదే క్రమంలో నల్లమల లోతట్టు ప్రాంతాల్లో ఉండే చెంచు గిరిజనులకు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, పసిరికలు, మధుమేహం, హిమోగ్లోబిన్, థైరాయిడ్ వంటి పరీక్షలను మన్ననూరులోనే నిర్వహించి వ్యాధినిర్ధారణ చేసేందు కోసం రూ.30 లక్షలతో డయాలసిస్ కేంద్రం కోసం భవన నిర్మాణాన్ని చేపట్టి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్ భవనాన్ని ప్రారంభించారు. పరికరాలు, సిబ్బందిని ఏర్పాటు చేయలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ఏరియాల్లో డయాగ్నోస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించగా వాటిలో మన్ననూరు డయాగ్నోస్టిక్ సెంటర్ పేరు ఉంది. కానీ అధికారులు ఇట్టి కేంద్రానికి లాబోరేటరీ సామగ్రిని సమకూర్చకుండా, జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాల ఆసుపత్రిలోనే డయాగ్నోస్టిక్ కేంద్రం నిర్వహిస్తున్నారు. నల్లమల గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే దూరాభారం పెరిగింది. స్థానికంగా ఉండే ప్రైవేటు ల్యాబ్‌లలో డబ్బులు వెచ్చించి పరీక్షలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి నల్లమలలో మన్ననూరులోని ఈ ఆరోగ్య కేంద్రం, డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నల్లమల ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

## ప్రైవేట్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుంటున్నాం



ప్రైవేటు ల్యాబ్‌ల్లో డబ్బులు వెచ్చించి పరీక్షలు చేయించుకుంటున్నాం. మన్న నూరులో మలేరియా, టైఫాయిడ్, షుగర్ వంటి టెస్టులు ప్రభుత్వ దవాఖానాలో ఈ టెస్టులు చేస్తే మాకు సౌకర్యంగా ఉంటుంది.

**- తోకల ఈదమ్మ**

## అచ్చంపేటకు రెఫర్ చేస్తున్నారు..



తమకు అత్యవసర పరిస్థితుల్లో మన్ననూరు పీహెచ్‌సీకి వస్తే అంబులెన్సులో అచ్చంపేటకు రెఫర్ చేస్తున్నారు. ఇక్కడే వైద్య పరీక్షలు నిర్వహించే సౌకర్యం కల్పించాలి.

**- నిమ్మల లింగయ్య, భౌరాపూర్ పెంట**


స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

# ఘనంగా కేవీకే స్థాపన స్వర్ణోత్సవాలు

బిజినేపల్లి, జూన్ 6 : కృషి విజ్ఞాన కేంద్రాలను స్థాపించి 50 వసంతాలు పూర్తి కావడంతో స్వర్ణోత్సవా లను ఘనంగా నిర్వహించినట్లు ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని ఆర్ఏ ఆర్ఎస్‌లోని ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన స్వర్ణోత్సవ సభలో ఆయన మాట్లాడారు. పాండి చ్చేరిలో 1974 మార్చి 21న దేశంలో మొదటి కృషి విజ్ఞాన కేంద్రాన్ని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింద న్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసి మారుతున్న వ్యవసాయ రంగ విస్తరణ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్న తెలిపారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, కేవీకే, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా పాగుంట వెంకన్న కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కేటీదొడ్డి, జూన్ 6 : అమావాస్య సందర్భంగా కేటీదొడ్డి మండలం, వెంకటాపురం సమీపంలో ని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురు వారం నిర్వహించిన కల్యాణోత్సవం వైభవంగా కొనసా గింది. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్ర హాలకు అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం అర్చకు లు, భక్తులు ఉత్సవమూర్తులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ మూ ర్తులను ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేదికపై ఉంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేడుకను తిలకించడానికి తెలంగాణ, కర్ణాటక రా ష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమి టీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమం లో శేషిరెడ్డి, గోపి, పద్మారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

# వచ్చేనెల 3 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

▸▸ పాల్గొననున్న తెలంగాణ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ▸▸ ఎండీబీఏ అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 6 : మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం లో వచ్చేనెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల బ్యాడ్మిం టన్ టోర్నీ నిర్వహించనున్నామని మహబూబ్‌నగ ర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేష న్ ఆధ్వర్యంలో మొదటిసారి రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వహణకు రాష్ట్ర సంఘం అవకాశం ఇచ్చిందన్నా రు. గతంలో జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం లేకపోవడం వల్ల రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వహించ లేకపోయామన్నారు. మాజీ క్రీడా శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ హయాంలో జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం జరిగిందన్నారు. అసో సియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి టోర్నీ నిర్వ హించుకునేందుకు అవకాశం లభించిందన్నారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, 15 మంది ఆఫిషియల్స్ పా ల్గొంటారని తెలిపారు. మూడో తేదీన క్వాలిఫై యింగ్ రౌండ్, నాలుగు నుంచి ఆరో తేదీ వరకు డబుల్స్, సింగిల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయని వివరించారు. క్రీడాకారుల కు వసతి, భోజన సౌక ర్యం కల్పిస్తున్నట్లు తెలి పారు. టోర్నీ ప్రారంభోత్స వానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతిని ధి, రాష్ట్ర క్రీడా వ్యవహారా ల శాఖ సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ హాజ రుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగా ణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, కార్యనిర్వహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షు డు మహ్మద్‌హమెద్‌అలీ, జీ.శివప్రసాద్, ఎంపీ. ప్రవీణ్‌కుమార్, ఈసీ మెంబర్ సతీష్‌జోసెఫ్, భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎండీబీఏ అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్ గౌడ్

# ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు

▸▸ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ఉండవల్లి, జూన్ 6 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని బైరాపురంలోని బీసీ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో, వీధుల్లో మోకాలిలోతు వర్షపు నీరు నిలుస్తోందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజాదర్బార్ లో చేసిన ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. గ్రామస్థులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారి కన్నా దిగువన బీసీ కాలనీ ఉంది. కాలనీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో ప్రతీ వర్షాకాలంలో కాలనీలో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను సమస్యను ప రిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో కాలనీకి చెందిన గురురాజ్ గత ఏడాది డిసెంబర్ 11న హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత వరుసగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకోలే దు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో ఎంపీవో పద్మావతి బీసీ కాలనీలో పర్యటించి, సమస్యను తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్డు ఎత్తు పెంచడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు.


బైరాపురం బీసీ కాలనీలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎంపీవో

# మా కాలనీకి సీసీ రోడ్డు వేయండి

▸▸ బురద నీటిలో కూర్చొని నిరసన


నాగర్‌కర్నూల్‌లోని 17వ వార్డులో బురద నీటిలో కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6: జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో గురువా రం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కాలనీలోని రాడ్లన్నీ జలమయమై చిత్తడిగా మారాయి. కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షానికి గోతుల్లో వ ర్షపు నీరు నిలిచిపోయి ద్విచక్ర వాహనదారులు సైతం రాకపోకలకు ఇబ్బంది గా మారింది. బీజేపీ బూత్ అధ్యక్షుడు బాలరాజు కాలనీవాసులతో కలిసి బురద నీటిలో కూర్చొని సీసీ రోడ్లు వేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి 17వ వార్డును దత్తత తీసుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేసి సీసీ రోడ్డు వేయకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చామని, సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినా నేటికి ఆచరణలో పెట్టలేదని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులు స్పందిం చి కాలనీలో సీసీ రోడ్డు వేసి, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగిం చాలని కోరారు. లేని పక్షంలో కాలనీవాసులతో కలిసి నిరాహార దీక్షకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

# అడవి నుంచి వచ్చిన చుక్కల దుప్పి

▸▸ పట్టుకొని అటవీ శాఖ అధికారులకు అప్పగింత

అమ్రాబాద్, జూన్ 6: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే తిరుమలాపూర్ అటవీ ప్రాంతం నుంచి చెదిరి వచ్చిన ఒక చుక్కల దుప్పిని గ్రామస్థులు పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించిన సంఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఒక చుక్కల దుప్పి చెదిరిపోయి గ్రామంలోకి రావడంతో ఊర కుక్కలు వెంబ డించాయి. దీంతో పరుగెత్తుకొంటూ వచ్చి ఊరు చివర ఉన్న ఓ ఇంటిదగ్గర నిలిచిపోయింది. వెంటనే గ్రామస్థులు స్థానిక అటవీ అధికారులకు సమాచా రం అందించారు. డీఆర్‌వో లక్ష్మీకాంత్, బీట్ ఆఫీసర్ గోపాల్ తదితరులు అక్కడికి చేరుకొని స్వల్పంగా గాయపడిన దుప్పికి ప్రథమ చికిత్స అందిం చారు. ఆ తర్వాత ఆరోగ్యంగానే ఉందని నిర్ధారించుకొని చుక్కల దుప్పిని ఆ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోనే వదిలి పెట్టినట్లు అమ్రాబాద్ అటవీ రెంజ్ అధికారి అదిత్య విలేకరులకు తెలిపారు.


బీకే తిరుమలాపూర్ గ్రామంలోకి వచ్చిన చుక్కల దుప్పి

# చెరువులు, కుంటల్లోకి చేరిన వర్షపు నీరు


అమ్రాబాద్ సమీపంలోని లోకేశ్వరం చెరువులోకి చేరిన వర్షపు నీరు

అమ్రాబాద్, జూన్ 6 : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం రా త్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షం కా రణంగా చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఈ ప్రాంతంలో చెదురు ముదురు వర్షాలు కురుస్తుండ డంతో రైతులు పత్తి, కంది, జొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో ఇటీవల కురిసిన వర్షానికి విత్తుకున్న రైతుల పత్తి విత్తనాలపై మట్టి పేరుకుపోయి మొలిచే అవకాశం లేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఇష్టానుసారంగా విధులు

**- 12 గంటల తర్వాత అధికారులు ఆఫీస్‌కు రాక**

ఉప్పునుంతల, మే 6 : అది మండల పరిషత్ కార్యాలయం.. 12 గంటలైనా అధికారులు రారు.. దీని పర్యవసానంగా పనుల నిమిత్తం వచ్చే వారికి ఇక్కట్లు తప్పడం లేదు. ఉప్పునుంతలలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సమయం పాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రోజూ 12 గంటల నుంచి మధ్యాహ్నం తరువాత విధులకు హాజరవుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ పనుల నియమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అధికారులు లేకపోవడంతో రోజుల తరబడి తిరగవల్సి వస్తున్నదని మండల ప్రజలు వాపోతున్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా.. 12 గంటల అవుతున్నా కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శేఖర్ తప్పా మిగతా అధికారులు లేక ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అచ్చంపేట ఎంపీడీవో ఉప్పునుంతల ఇన్‌చార్జిగా వ్యహరిస్తున్నారు. ఇదే అదునుగా తీసుకున్న అధికారులు సమయపాలన పాటించకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సూపరింటెండెంట్ మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ ఉప్పునుంతలలో విధులు నిర్వహిస్తుంటారు. మిగతా సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ అచ్చంపేట పట్టణంలో నివాసం ఉంటూ ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఇన్‌చార్జి ఎంపీడీవో బాలచంద్రసూర్యన్‌ను వివరణ అడగగా, సమస్య నా దృష్టికి రాలేదని అధికారులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పుకొచ్చారు.


ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఎంపీడీవో కార్యాలయం

సమయపాలనేది?

బౌరా.. ఇదేం చోద్యం..!

## మందు బాబులకు అడ్డాగా బస్టాండ్

**- తాగిన మైకంలో అక్కడే కునుకు**

**- ఇబ్బందుల్లో ప్రయాణికులు**

అచ్చంపేటటౌన్, జూన్ 6: నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ కొందరి మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. అతిగా తాగి బస్టాండ్‌లోనే కునుకుపాట్లు పడుతున్నారు. ఈ మధ్య కాలంలో మహిళా ప్రయాణికులతో కిక్కిరిపోతున్న బస్టాండ్‌లో ఇలాంటి సంఘటనలతో ఇబ్బందులకు గురౌవుతున్నారు. బస్టాండ్‌లో పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ప్రయాణికులు విమర్శిస్తున్నారు.


బస్టాండ్‌లో ఆదమరిచి నిద్రిస్తున్న తాగుబోతు

## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి


కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6: ఈ నెల 9న జరిగే గ్రూప్ ప్రిలిమినరీ పరీక్షను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు అధికారులు, అబ్జర్వర్లతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 18 కేంద్రాలను ఏర్పాటు చేశారన్నామని, 5,221 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహించే సమయంలో కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోని గంట ముందే అనుమతిస్తామన్నారు. రీజినల్ కోఆర్డినేటర్ మధుసూదన్‌శర్మ పాల్గొన్నారు.

## శనీశ్వరస్వామి జయంతి ప్రత్యేక పూజలు


నందివడ్డెమాన్ శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 6 : వైశాఖ అమావాస్య రోజున శనేశ్వర జయంతి పురస్కరించుకొని శనీశ్వర స్వామి భక్తులు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. మండలంలోని నందివడ్డెమాన్‌లో నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి గురువారం ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నందీశ్వరాలయంలోని బ్రహ్మసూత్రం ఉన్న శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో పలువురు భక్తులు హోమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు శాంతికుమార్, ఉమ్మయ్య, విశ్వారాధ్య, జయంత్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, వీరశేఖర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఆచారి జన్మదిన వేడుకలు


కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, జూన్ 6: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తల్లోజు ఆచారి హాజరై కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బీజేపీ శ్రేణులు, ఆచారి అభిమానులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపా రు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు శేఖర్ రెడ్డి, నరసింహ, కృష్ణగౌడ్, గంగాధర్, బాబీదేవ్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు. కల్వకుర్తి పట్టణంలోని వీబీఎస్ వృద్ధాశ్రమంలో తల్లోజు ఆచారి జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ శ్రేణులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు నరసింహ, చారి, రాఘవేందర్‌గౌడ్, గంగాధర్ ఉన్నారు.

## అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

పెంట్లవెల్లి, జూన్ 6 : మండల కేంద్రంలో యంగంపల్లితండాకు వెళ్లే దారిలో వెలసిన అభయాంజనేయస్వామి దేవాలయంలో గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. వైశాఖ మాస బహుళ పక్ష అమావాస్య సందర్భంగా అభయాంజనేయస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి మొదటగా పంచామృతాభిషేకం, సింధూరలేపనం, ఆకుపూజ, 12:30గంటలకు మహామంగళ హారతి కార్యక్రమాలతో పాటు తీర్థప్రసాద వితరణ అందించారు. ఆలయ అర్చకులు లోకేశ్వరయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'మతోన్మాద విధానాలపై రాజీలేని పోరాటం'

కొల్లాపూర్, జూన్ 6 : ప్రజలను మభ్య పెట్టే మతోన్మాద విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. గురువారం సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో రెండవ రోజు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు, ఆర్.శ్రీనివాస్, శ్రీఅంజనేయులు, మండల కార్యదర్శి బూర్గం శివవర్మయాదవ్, నాయకులు ఈశ్వర్, తారాసింగ్, కిరణ్, సలీం, జల్లాపురం సురేందర్, రాజు,సంజు, కార్తీక్, అశోక్, మధు పాల్గొన్నారు.

## కూలిన ప్రహరీని పునర్ నిర్మించాలి


డిగ్రీ కళాశాల ప్రహరీని పరిశీలిస్తున్న బీఎస్‌ఎఫ్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూలిన ప్రహరీ గోడను పునర్ నిర్మించాలని బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. వర్షానికి కూలిపోయిన కళాశాల ప్రహరీ గోడను గురువారం బీఎస్పీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని పనులు చేయడంతోనే కట్టిన రెండేళ్లలోపే కళాశాల ప్రహరీ గోడ కూలిపోయిందని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి విచారణ జరిపించి కూలిన ప్రహరీ గోడను సంబంధిత కాంట్రాక్టర్‌తో తిరిగి నిర్మింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఎస్‌ఎఫ్ నాయకులు బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు భూషపాగ మధు, నాయకులు శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

## పేదలకు అండగా రత్నగిరి ఫౌండేషన్

కొల్లాపూర్, జూన్ 6 : నిరుపేదలకు అండగా రత్నగిరి ఫౌండేషన్ ఎల్లవేళలా ఉంటుందని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అన్నారు. కొల్లాపూర్ పట్టణంలో వేసవికాలంలో పేదల దాహార్తిని తీర్చేందుకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావుచే ప్రారంభించిన చలివేంద్ర, అంబలి కేంద్రాల ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. దాదాపు నెలన్నర పాటు మండుటెండల్లో వచ్చే ప్రజల దాహార్తి, ఆకలి తీర్చేందుకు మంచినీరు, అంబలిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్వహణ సభ్యులు సందీప్, దాసరి సాయికుమార్‌యాదవ్, సురేష్, సాయిచరణ్‌రెడ్డి, రాఘవేంద్ర, గణేష్ పాల్గొన్నారు.

# నల్లమలలో ఎవరూ అనారోగ్యం బారిన పడొద్దు

**- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**

అచ్చంపేటటౌన్, జూన్ 6: నల్లమలలో ఎవరూ అనారోగ్యం బారిన పడవద్దు.. ప్రతీ ఒక్కరికి ఉచిత వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సర్జికల్ క్యాంపులో భాగంగా చివరి రోజు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆరోగ్యసమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో కలిసి రోగులకు సర్జరీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగులలో ప్రధానంగా హెర్నియా, గర్భసంచి, కణితులు, తదితర సమస్యలతో వచ్చారని, వారికి విజయవంతంగా సర్జరీలు చేశామన్నారు. పేర్లు నమోదు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఇక్కడే సర్జరీ చేయనున్నట్లు తెలిపారు. కాబట్టి ప్రజలందరూ అధైర్యపడవద్దని, అందరికి వైద్యం అందిస్తామన్నారు. ఇంతపెద్ద సర్జికల్ క్యాంప్ విజయవంతం అయి ఇంత మందికి ఉచిత వైద్యం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. డీసీహెచ్ రమేష్ చంద్ర, డీఎంహెచ్‌అండ్‌వో సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభు, జనరల్ సర్జన్లు రామచందర్, మహేష్, బాల్‌సింగ్, వైద్య సిబ్బంది ఉదయ్, హరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చికిత్సలందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

# దంచికొట్టిన వాన

**- చెరువులను తలపిస్తున్న పట్టణంలోని పలు కాలనీలు**

అచ్చంపేటటౌన్, జూన్ 6: అచ్చంపేట పట్టణంతో పాటు మండల పరిధిలోని బోమ్మన్‌పల్లి, సిద్దాపూర్ తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుడడంతో పట్టణంలోని కాలనీలు, చెరువులను తలపిస్తున్నాయి. పట్టణంలోని వేంకటేశ్వర కాలనీతో పాటు ఉప్పునుంతల రహదారి వెంట ఉన్న కాలనీలలోని ఇళ్ల మధ్యలో భారీగా వర్షపు నీరు చేరడంతో నిండు చెరువులా కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని బోమ్మన్‌పల్లి గ్రామ సమీపంలోని వాగు పొంగిపోర్లింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఇళ్లు, మట్టి ఇళ్లలో నివసించే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.


వెంకటేశ్వర కాలనీలో ఇళ్ల మధ్య చేరుకున్న నీరు


ధారారం వాగు దగ్గర పూజలు చేస్తున్న రైతులు

**భారీ వర్షం- పొంగిన వాగులు**

లింగాల : నైరుతి రుతుపవనాలు ప్రారంభం కావడంతో మండలంలో వాతావరణం చల్లబడింది. బుధవారం రాత్రి 48 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. ఈ వర్షాలకు మండలంలోని పలు వాగులు పొంగిపొర్లాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలకు భూములు దున్న డానికి అదునుకావడంతో రైతులు విత్తనాలు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండలంలోని పలు ప్రాంతాల్లో విత్తనాలను వేస్తున్నారు. వర్షాభావ పంటలైన మొక్కజొన్నలు అధిక శాతంలో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

# ఘనంగా ప్రారంభమైన బడిబాట



కొల్లాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

కొల్లాపూర్, జూన్ 6 : బడి ఈడు పిల్లల్ని తప్పనిసరిగా బడిలో చేర్పాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సంధ్యారాణి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని గాంధీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సంధ్యారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బంగారు శోభారాణిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బడిబాట ప్రతిజ్ఞను ఉపాధ్యాయులందరూ చేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చక్కని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు రావాలని పిలుపునిచ్చారు.

● వెల్దండ: మండలంలోని అన్నిగ్రామాల్లో బడిబాట కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బడిబయట ఉన్న పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. ఉపాధ్యాయులు జైపాల్ రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

● కోడేరు: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎత్తం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్ప అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎత్తం, నర్సాయిపల్లి, మైలారం తదితర గ్రామాలల్లో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి విద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి మండలాలకు విద్యార్థులకు అవసరమైన సామగ్రి చేరిందన్నారు. ఆయా ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: మండలంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరుగుతూ బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలని కోరారు. ప్ర భుత్వ బడుల్లో మెరుగైన విద్య లభిస్తుందని ఉచిత పుస్తకాలు విశాలమైన తరగతులు ఉంటాయని, మధ్యాహ్న భోజనం లభిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్ర శాంత్‌కుమార్, నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్ ఉన్నారు.

● లింగాల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని లింగాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్ అన్నారు. గురువారం లింగాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను విడుదల చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బడిబాట ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ బడుల్లో ఉన్న వసతులు, విద్యా బోధన గురించి తెలియజేశారు. మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని ప్రధానోపాధ్యాయులు సి.వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు బలరాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● తాడూరు: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే ప్రధాన లక్ష్యంతోనే బడిబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఎంఈవో భాస్కర్‌రెడ్డి అన్నారు.

గురువారం బడిబాటలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు తిరుగుతూ బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే


పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూన్ 6 : వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన జంగమ్మ అలియాస్ కృష్ణవేణి, భర్త కృష్ణయ్యలతో పాటు ఈదమ్మలు వ్యవసాయ పొలంలో పని చేస్తున్నారు. గురువారం వర్షం రావడంతో పక్కనే ఉన్న చెట్టు కిందికి వెళ్లడంతో ఉరుములతో కూడిన వర్షంలో పిడుగు పడింది. ఈ పిడుగుపాటుకు కొమరిక జంగమ్మ అలియాస్ కృష్ణవేణి(45) అక్కడికక్కడే మృతి చెందగా కృష్ణయ్య, ఈదమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని వైద్య చికిత్సల నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంకు సూచించారు.

అదేవిధంగా పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించిన మృతదేహాన్ని ఎమ్మెల్యే పరిశీలించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వెల్దండ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, పర్వత్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శేఖర్, కౌన్సిలర్లు ఎజాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నియంత్రణ చేపడితే పర్యావరణం కాపాడినట్లే

అచ్చంపేటటౌన్, జూన్ 6: ప్లాస్టిక్ నియంత్రణ చేపడితే పర్యావరణం కాపాడినట్లేనని మునిసిపల్ కమిషనర్ శ్యాంసుందర్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మృతుభూమి ఆధ్వర్యంలో క్లాత్ బ్యాగ్‌లను మృతుభూమి సంస్థ అధ్యక్షుడు రమాకాంత్‌తో కలిసి సిబ్బంది అందజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల అక్రమ నిర్మాణాలపై చర్యలు

**- జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ**


అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారితో మాట్లాడుతున్న డీపీవో కృష్ణ

చారకొండ, జూన్ 6: మండల పరిధిలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన సర్వే నెంబరు 327, 328 లలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని సిర్సనగండ్ల పంచాయతీలోని అయోధ్యనగర్(గుట్ట)లో సితారామచంద్ర స్వామి దేవాలయ భూమిలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారితో డీపీవో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవాలయ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. సంబంధించిన పత్రాలు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఇవ్వాలని సూచించారు. అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి వారం రోజుల క్రితమే పంచాయతీ కార్యదర్శి మహేష్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలపై సరైన పత్రాలు లేకుంటే కోర్టు ఉత్తర్వులు, పంచాయతీ చట్టం 2018 ప్రకారం చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

**రికార్డుల పరిశీలన**

మండలంలోని సిర్సనగండ్లలో పల్లె ప్రకృతివనం, ఇరిగేషన్‌షెడ్డు, నర్సరీలు, వైకుంఠ ధామం, రికార్డులను జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. నర్సరీలో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేయాలని అన్నారు. వైకుంఠధామంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. సెగ్రిగేషన్ షెడ్లలో వానపాములతోటి పద్ధతి ప్రకారం వర్మి కంపోస్టు ఎరువును తయారు చేయాలని అన్నారు. మల్టిపర్పస్ వర్కర్లతోటి గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య పనులను చేపట్టాలని అన్నారు. ఎంపీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి


సీఎంను శాలువాతో సన్మానిస్తున్న వెంకటేష్

చారకొండ, జూన్ 6: మండల కేంద్రాని చెందిన రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి గెలుపునకు కార్యకర్తలు ఎంతో కృషి చేశారన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలను అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని సీఎంను వెంకటేష్ కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

**సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు**


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వంగూరు, జూన్ 6: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వంత మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కాంగ్రెస్ నాయకులు పులిజాల కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు కలిసి సీఎంను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## నీట్‌లో ర్యాంకు.. విద్యార్థినికి సన్మానం

ఊర్కొండ: మండల కేంద్రానికి చెందిన వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షకుడు దార ప్రసాద్ కూతురు దార కీర్తి నీట్ పరీక్షలో 539 మార్కులు సాధించినది. దాంతో మండల కేంద్రంలోని వారి స్వగృహంలో దార కీర్తిని శాలువతో సన్మానించి అభినందించారు. మాజీ ఉప సర్పంచ్ కంఠం యాదయ్య, యువజన విభాగం మండల అధ్యక్షుడు కంఠం విజయుడు, నాయకులు భాస్కర్, సంతోష్‌రెడ్డి, శంకర్, జుబేర్, నవీన్, భగవంతు తదితరులు ఉన్నారు.

**నీట్‌లో మెరిసిన విద్యార్థిని అనూష**



● కల్వకుర్తిటౌన్: నీట్ పరీక్షలో 720 మార్కులకుగాను పట్టణానికి చెందిన మ్యాకల అనూష 526 మార్కులు సాధించి తన ప్రతిభ చాటింది. అదే విధంగా ఎంసెట్‌లో సైతం 2025 ర్యాంకు సాధించిందని తల్లిదండ్రులు అమరావతి, మల్లికార్జునలు తెలిపారు. పట్టణపద్మశాలి సంఘం నేతలు అనూషను ఘనంగా సన్మానించారు.

## మునిసిపల్ కార్మికులకు అండగా ఉంటాం

కల్వకుర్తిటౌన్, జూన్ 6 : మునిసిపల్ కార్మికులకు అండగా ఉంటామని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. గురువారం ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మయ్య, దిలీప్‌లను ఆయన పరామర్శించి వారితో మాట్లాడారు. కార్మికుల ఆరోగ్యం ఎలా ఉందని వైద్యులను అడిగి, చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స అందించాలని, వారికి తగిన వసతులు కల్పించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకు లు తదితరులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు

పెద్దకొత్తపల్లి, జూన్ 6 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లితో పాటు వివిధ గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు, నాసిరకమైన ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాలు, నాసిరకమైన మందులను విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

● తిమ్మాజిపేట: రైతుకు కల్తీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ హెచ్చరించారు. తిమ్మాజిపేటలోని న్యూమణికంఠ ఆగ్రో ఏజెన్సీస్ శ్రీహనుమాన్ అన్నదాత శ్రీనివాస, బాలాజీ, రైతుమిత్ర విత్తనాలు పురుగుల మందులు అమ్మే దుకాణాలు గురువారం వ్యవసాయాధికారి కమల్‌కుమార్ తనిఖీ చేశారు.

## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ, జూన్ 6: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్ పర్సన్ జంగయ్య అన్నారు. గురువారం మండలంలోని చంద్రాయన్‌పల్లిలో అంబుడ్స్ పర్సన్ జంగయ్య ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వారం వారం డబ్బులు వస్తున్నాయా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ఏమైనా సమస్యలు ఉంటే కాంప్లెంట్ బాక్సుల్లో వేయాలని అన్నారు.

## బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

ఉప్పునుంతల, జూన్ 6 : బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని హెచ్‌ఎం రామస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లోని ప్రధానవీధిలో బడిబాట ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బడీడు పిల్లల ఇంటికి ఉపాధ్యాయులు వెళ్లి విద్యార్థులకు నూతన అడ్మిషన్ ఇచ్చారు. బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, ప్రజాసంఘాలు కృషి చేయాలని వారు కోరారు.